# మానేరు జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

25.2.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 307 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## సెమీస్‌కు ఇంగండ్

బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్.. పాకిస్థాన్‌పై ఘన విజయం




7

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




## కేరళ.. ఇక నుంచి కేరళం

**రాష్ట్ర పేరు మార్పునకు కేంద్రం ఆమోదం**

**సేవా తీర్థ్‌లో తొలిసారి క్యాబినెట్ భేటీ**

కేరళ ఇకపై కేరళం కానుంది. ఈ రాష్ట్రం పేరును మార్చడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.



4

## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

**దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం**

**గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు**

**14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్**

4

మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి.






# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

## దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు

**మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం పతనం**

**రాష్ట్ర ప్రభుత్వ పునరావాస చర్యలతో లొంగుబాట్లు**

**పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది**

**వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ**

**డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి**

**నేపాల్‌లో గణపతి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు?**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మిగతా 2 లో

## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం



**ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం**

**లొంగిన మావోయిస్ట్‌లు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి**



## కన్నతల్లి కరకశత్వం

**రెండునెలల చిన్నారి కిరాతక హత్య**

**కట్టెల పొయ్యిలో వేసి హతం**

.. వివరాలు 2లో



## అంబర్‌పేటలో తీవ్ర విషాదం

**కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య**

**హోటల్ నడుపుతూ దర్జాగా బతుకుతున్న కుటుంబం**

**ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్**

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

.. వివరాలు 2లో




## కోటి ఎస్‌బీఐ ఏటీఎం కాల్పుల ఘటన

**కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు**

**నిందితులను వేటాడి పట్టుకున్న బృందాలు**

.. వివరాలు 2లో

## ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

**ఆరోగ్య, బీమా పథకాలపై హర్షం.. సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు**



2



## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు**

**పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

## మీ అరచాకాలను ఇక సహించేది లేదు

**మా నేతలను జైలులో పెడితే భయపడబోం**

**నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్**

**బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కేటీఆర్**

ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు.



3




## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

**ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా**

**తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'**

**'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**

## 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం

**అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి**

**పకడ్బందీగా పరీక్షల నిర్వహణ**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్**



2

## రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు

**బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు మాని ఆసుపత్రుల నిర్మాణం పూర్తి చేయడం సీఎం దృష్టిపెట్టాలి**

**సీఎంకు ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస పేదలకు ప్రాణాలపై లేదు**

**దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ స ర్కార్ ఆగమాగం చేస్తోంది**

**రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ పైనే ఫుల్ ధ్యాస**

**పేదలకు ప్రాణం పోసే వరంగల్ 'హెల్త్ సిటీ' మీద లేదు**

**బీఆర్ఎస్ పక్షాన వరంగల్ గడ్డ పైనే నిరాహారదీక్షకు దిగుతాం**

3





# ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

## ఆరోగ్య, బీమా పథకాలపై హర్షం

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇనర్ణయం తమకెంతో భరోసా నింపిందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు కలిసారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రశంసలు కురిపించారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలోతెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నేతలు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# కన్నతల్లి కరకశత్వం

## రెండునెలల చిన్నారి కిరాతక హత్య... కట్టెల పొయ్యిలో వేసి హతం

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని క్టటెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్ కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

# అంబర్‌పేటలో తీవ్ర విషాదం

## కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

## హోటల్ నడుపుతూ దర్జాగా బతుకుతున్న కుటుంబం

## ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను భర్త రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)గా గుర్తించారు. తొలుత మాధవిని రామరాజు, శశాంక్ ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వారిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హోటల్ వ్యాపారంలో నష్టం, అప్పుల వారి వేధింపులతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు ఎన్నో ఏళ్లుగా హోటల్ బిజినెస్ చేస్తున్నారు. కానీ ఏం కష్టం వచ్చిందో తెలియదు? అర్ధాంతరంగా ఈ కుటుంబం తనువు చాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతికి ఆర్థిక భారం కారణం అంటూ సూసైడ్ నోట్ రాశారు. నిజంగానే వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? లేక పరువు పోతుందేమోనన్న భయంతో ముగ్గురు సూసైడ్‌కు పాల్పడ్డారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అంబర్ పేట్ లోని బాపూజీ నగర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ల్యాండ్ మార్క్ హోటల్ యజమాని కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య పాల్పడ్డారు. మృతులను రామ్‌రాజ్, మాధవి, శశాంక్‌గా గుర్తించారు. హైదరాబాద్ అంబర్ పేట్‌లో ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని రామ్‌రాజ్ ఫ్యామిలీ సూసైడ్ చేసుకున్న వార్త స్థానికంగా కలకలం సృష్టించింది. రామ్ రాజ్ ఫ్యామిలీ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట్‌లోనే నివాసం ఉంటున్నారు. సొంతిల్లు.. పెద్ద భవనం.. కోట్లలో ఆస్తులు ఉన్నాయి. కానీ ముగ్గురు సూసైడ్ చేసుకోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.. రామ్ రాజ్ ముందు భార్య మాధవిని చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. మరోవైపు రామ్‌రాజ్ కుమారుడు శశాంక్ తన ఎడమ చేయి కోసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కానీ అతను చనిపోకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నట్టు రామ్‌రాజ్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. తన ఆస్తులు మొత్తం తన కూతురికేనంటూ వీలునామా కూడా రాసినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌రాజ్ కూతురు అమూల్య కొంపల్లిలో ఉంటున్నట్లు తెలుస్తోంది. సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు పోలీసులు. రామ్‌రాజ్ కూతురు ఏదైనా కోణంలో అనుమానం వ్యక్తం చేస్తే.. ఆ దిశగా కూడా విచారణ చేస్తామని చెప్పారు పోలీసులు. ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని కుటుంబం మృతిపై రామ్‌రాజ్ అన్న జగదీశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పెద్ద సమస్య కాదని, తమది వెల్ సెటిల్డ్ కుటుంబం అని చెప్పారు. తమకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు జగదీష్. నా తమ్ముడు ఫ్యామిలీ సూసైడ్ ఎందుకు చేసుకున్నారో.. అసలు ఏం జరిగిందో తెలియడం లేదని కంటతడి పెట్టారు. మరోవైపు తెల్లవారు 3 గంటల 15 నిమిషాలకు రవి అనే మిత్రుడికి రామ్ రాజ్ వాట్సాప్‌లో సూసైడ్ చేసుకున్నామని మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తన మిత్రుడు రామ్ రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యభర్తలు ఇద్దరు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు రవి. రామ్ రాజ్.. అంబర్‌పేట్‌లో ల్యాండ్ మార్క్ హోటల్, మల్లేపల్లిలో బిరియాని సెంటర్, మల్లాపూర్‌లో కింగ్స్ హోటల్, చక్రిపురంలో మరొక హోటల్ నిర్వహిస్తున్నారు. ఐతే ఎవరైనా అప్పులు ఇచ్చిన వారు భయపెడితే చనిపోయారా? ఎవరైనా భయపెట్టారా? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె



నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

### ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం

### లొంగిన మావోయిస్టులు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి

మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్రనేతలు డిజిపి ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ సందర్భంగా దేవ్‌జీ మీడియాతో మాట్లాడుతూ.. 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్దాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను.

త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని అన్నారు. మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

## భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు

## పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో 489126 మంది, సెకండియర్‌లో 507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన లాంటి సమస్యలను అధిగమించేందుకు 14416, 80693 91416 నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని, విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని కృష్ణ ఆదిత్య తెలిపారు.

# 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం

## అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

## పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

## కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్ట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గా÷-జడెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమ్మర్గ÷న్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా ఖి.ఖీ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

# కోటి ఎస్‌బీఐ ఏటీఎం కాల్పుల ఘటన

## కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## నిందితులను వేటాడి పట్టుకున్న బృందాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** నగరంలోని కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గత నెలలో కాల్పులు జరిగిన కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. ఈ కాల్పులకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వారిని పోలీసులు విచారిస్తున్నారు. జనవరి 31న కోఠి ఎస్‌బీఐలో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన రిన్షద్ అనే వ్యక్తి వచ్చాడు. అతడిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. అనంతరం అతడి వద్దనున్న రూ. 6 లక్షల నగదుతో పాటు బాధితుడి వాహనాన్నీ తీసుకుని పరారయ్యారు. ఈ కాల్పుల్లో రిన్షద్ కాలికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని రిన్షద్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్‌బీఐ ఏటీఎం ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ చోరీ అనంతరం నిందితులు కాచిగూడ డీమార్ట్ సమీపంలోని ప్రార్థనా మందిరంలోకి వెళ్లి.. దుస్తులు మార్చుకున్నట్లు గుర్తించారు. తర్వాత వాహనాన్ని రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి పరారయ్యారు. అక్కడి నుంచి వారు రైలెక్కి పారిపోయారా? లేక బస్సు కానీ ఇతర వాహనంలో కానీ వెళ్లారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అలా నిందితుల్లో ఒకరిని ఫిబ్రవరి 16న హరియాణాలో అరెస్ట్ చేశారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందుకోసం ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలించి ఎట్టకేలకు మరో నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు.

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

**ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా**

**తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'**

**'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ – ప్యూర్ – రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉ ంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి..అభివృద్ధి వ్యూహం

**అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లుగా ప్రభుత్వ ఐటీఐలు**

**పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళిక**

**కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఒక శాఖ మాత్రమే కాదు అభివృద్ధి వ్యూహంగా మారిందన్నారు కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి. గత కొన్ని సంవత్సరాలుగా ఐటీఐలు మరియు శిక్షణా మౌలిక వసతులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లు గా మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, డిజిటల్ పరికరాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు. కన్హా శాంతి వనంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ కాంపిటిషన్ 2025?26 దక్షిణ ప్రాంత పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఎ÷–లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ క్రాంతి వేస్లీ, ఐఏఎస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలలో మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో 350కి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 123 మంది యువతులు పాల్గొనడం ప్రోత్సాహకరంగా నిలిచింది. సంప్రదాయంగా పురుషాధిక్యంగా భావించే కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ప్లంబింగ్, హీటింగ్ వంటి రంగాల్లో 20 మంది మహిళలు పోటీ చేయడం సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలిచింది. 3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు మంత్రి గారు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఈ రోజు కేవలం సర్టిఫికెట్ల గురించినది కాదు. ఇది కృషి, క్రమశిక్షణ, అంకితభావం మరియు ప్రతిభను గౌరవించే రోజు. ఇక్కడ ఉన్న యువతను చూసినప్పుడు దేశ భవిష్యత్తుపై అపారమైన విశ్వాసం కలుగుతోంది అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తోందని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కరణ సామర్థ్యం, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను శిక్షణలో భాగం చేశామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేంద్రంగా ఎదిగిందని, అందుకే ఐఎ, రోబోటిక్స్, మెకాట్రానిక్స్, డేటా అనలిటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. 'నైపుణ్యాభివృద్ధి కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదు, సాధికారత కోసం కూడా. ఒక యువకుడు లేదా యువతి నైపుణ్యం నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, గౌరవం వస్తుంది, స్వతంత్రత సాధ్యమవుతుంది. నైపుణ్యం ఉన్న వారు అవకాశాల కోసం ఎదురుచూడరు, వారు అవకాశాలను సృష్టిస్తారని మంత్రి స్పష్టం చేశారు.

# 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

**బస్ టిక్కెట్ పొందే సౌకర్యం... ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్,పిబ్రవరి 24 :** టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మె-ంబైల్ యాప్ క్షఖఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.టి–24 టికెట్ పర్యాటకులకు, అప్పుడప్పుడు ప్రయాణించేవారికి మరియు ఒకే రోజులో బహుళ ట్రిప్పులు అవసరమయ్యే ప్రయాణీకులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్ , వెంకన్న, ఖుస్రో షా ఖాన్ ,రాజశేఖర్ , ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప , సిటీఎం శ్రీదేవి సిఈ(ఐటి) శ్ శ్రీదేవి,హైదరాబాద్ , రంగారెడ్డి ఆర్ఎం లు సుధాపరిమళ , శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు

# మీ అరచాకాలను ఇక సహించేది లేదు

**మా నేతలను జైలులో పెడితే భయపడబోం**

**నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్**

**బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కేటీఆర్**



**ఆదిలాబాద్,ఫిబ్రవరి24 :** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉ న్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార

దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉ ంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.

# రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు

**బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు మాని ఆసుపత్రుల నిర్మాణం పూర్తి చేయడం సీఎం దృష్టిపెట్టాలి**

**సీఎంకు ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస పేదలకు ప్రాణాలపై లేదు**

**దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ స ర్కార్ ఆగమాగం చేస్తోంది**

**రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ పైనే ఫుల్ ధ్యాస**

**పేదలకు ప్రాణం పోసే వరంగల్ 'హెల్త్ సిటీ' మీద లేదు**

**బీఆర్ఎస్ పక్షాన వరంగల్ గడ్డ పైనే నిరాహారదీక్షకు దిగుతాం**

**ఎంజీఎం ఆసుపత్రి ఎలుకలు, పందికొక్కులకు అడ్డాగా మారింది**





**వరంగల్:** బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయిన వరంగల్ సూపర్ స్పె షాలిటీ ఆసుపత్రిని చూస్తుంటే బాధేస్తోందని, 2024 దసరాకే ఇది ప్రారంభం కావాల్సింది, కేసీఆర్ ఉం డి ఉంటే ఈపాటికి ప్రజలకు అందు బాటులోకి వచ్చేదని, కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు అటకెక్కి, రెండు దసరాలు పోయి మూడోదసరా వ స్తున్నా కదలడం లేదని, రేవంత్ రె డ్డికి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ కేసీఆర్ కట్టిన ఈ హెల్త్ సిటీ మీద లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీకి పెట్టిన శ్రద్ధలో 10 శాతం పె ట్టినా ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని అన్నారు. రోగుల బంధు వుల కోసం కేసీఆర్ ధర్మశాల నిర్మిం చాలని నిర్ణయిస్తే, కాంగ్రెస్ ప్రభు త్వం దాన్ని సగానికి సగం తగ్గించిం దని, రోడ్ నెట్వర్క్, ఎలివేషన్ వ ర్క్ అన్నీ తగ్గించేశారన్నారు. కేసీ ఆర్ కి మంచి పేరు వస్తుందనే అ క్కసుతోనే ఈ నిర్లక్ష్యం, ఈ హెల్త్ సి టీకి ఎన్ని నిధులు కావాలో బీఆర్ ఎస్ ప్రభుత్వమే సమకూర్చి పెట్టిం దని, కానీ మీరు డిజైన్ల మార్పు పే రుతో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే ఆసుపత్రి ప్రారంభానికి నోచు కోవడం లేదని ఆరోపించారు.

వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పె షాలిటీ ఆసుపత్రి నిర్మాణ పను ల ను మాజీ మం త్రి, బీఆర్ఎస్ డి ప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి ప రిశీలించారు. ఈ పర్యటనలో హ రీష్ రావు వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవ తి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీ నివాస్, రవీందర్ రావు, మాజీ ఎం పీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటి కొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమే ష్, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, సీనియర్ నాయకులు నా గుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా పలు వురు స్థానిక నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు చేసి న వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే,. జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తా మని చెప్తున్నారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి 2000 మంది నర్సు లు, 1500 మంది డాక్టర్లు, 1000 మంది పారామెడికల్ సిబ్బంది కా వాలి. ఇంతవరకు రిక్రూట్మెంట్ కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందా, నోటిఫికేషన్ ఇచ్చారా? కనీసం సి బ్బంది లేకుండా హాస్పిటల్ ఎలా ప్రారంభిస్తారు. పేపర్లలో చూస్తే 'ఓ పీ సేవలు' ప్రారంభిస్తాం అని రాశా రు. ఇది సూపర్ స్పెషాలిటీ హాస్పి టలా? లేక బస్తీ దవాఖానానా.

కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఏ వి ధంగా దెబ్బతింటుందో ప్రజల ముం దు ఉంచాం. ఆ దెబ్బకు తెల్లారి ముఖ్యమంత్రి హడావిడిగా రివ్యూ చేసి అన్ని మోటార్లు నడపాలని ఆ దేశించారు. ఇది బీఆర్ఎస్ విజయ మే కాదు, రైతుల విజయం. డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప.. ప నులు కావడం లేదు. మంత్రులు దే వాదుల ప్రాజెక్టు తమ ప్రాధాన్యత అని పదేపదే చెప్తున్నారు, కానీ చే తల్లో మాత్రం అది వారికి చివరి ప్రా ధాన్యతగా మారింది. కేసీఆర్ ప్ర భుత్వంలో 7300 కోట్లు ఖర్చు పెట్టి 3 లక్షల 20 వేల ఎకరా లకు సాగు నీరు అందించాం. కానీ ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు డెడ్ లైన్లు మా ర్చుకుంటూ కాలయాపన చేస్తున్నా రు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రె డ్డి మార్చి 2026 నాటికి పూర్తి చే స్తామంటే, ఉత్తమ్ కుమార్ రెడ్డి 2027 మార్చి డెడ్ లైన్ పెట్టారు. ఇ ప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఏమో 2 025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తా మని మరో కొత్త డెడ్ లైన్ పెట్టారు. రోజుకో డేట్ మారుతోందే తప్ప ప్రా జెక్టులో అంగుళం పని కూడా ముం దుకు సాగడం లేదు. ఇరిగేషన్ మీద అసెంబ్లీలో మాట్లా డతామని ముఖ్యమంత్రి అంటు న్నారు. మేము మీ సవాల్‌ను స్వీ కరిస్తున్నాం. మైక్ కట్ చేయకుం డా, కెమెరా తిప్పకుండా చర్చకు పె ట్టు.. ఎన్ని రోజులైనా, ఏ ప్రాజెక్టు మీదైనా చర్చించడానికి మేము సి ద్ధంగా ఉన్నాం. ప్రజలే న్యాయ ని ర్ణే తలు. ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా తేల్చుకుందాం.మొన్న ఉ త్తమ్ కుమార్ రెడ్డి రివ్యూలో మా ట్లాడుతుంటే, ఆయనను ఆపి కడి యం శ్రీహరికి దేవాదులపై మంచి నాలెడ్జ్ ఉంది, నెక్స్ట్ రివ్యూలో ఆ యన్ను పిలవండి అని సీఎం అన డం ఇరిగేషన్ మంత్రిని అవమానిం చడమే. నీ సొంత క్యాబినెట్ మం త్రికే ఏమీ తెలియదని నువ్వే చె ప్తుంటే, ఇక నువ్వు వేరే వాళ్లతో ఎ లా పనులు చేయిస్తావు రేవంత్ రె డ్డి?

దేవాదులను పక్కనపెట్టి ఆంధ్రాకు నీళ్లు ఎలా వదులుతున్నావో, నల్ల మల సాగర్ కు ఎలా సహకరిస్తు న్నావో తెలంగాణ ప్రజలు గమని స్తూనే ఉన్నారు. ముందు ఆ 10 శా తం పనులు పూర్తి చేసి రైతుల పొ లాలకు నీళ్లివ్వు.వెంటనే ఎక్విప్మెం ట్, సిబ్బంది నియామకం పూర్తి చే సి పూర్తిస్థాయిలో ఆసుపత్రిని ప్రా రంభించాలి. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఇక్కడే నిరాహారదీక్షకు దిగు తాం. ఉ త్తర తెలంగాణకు సంజీవ ని లాంటి వరంగల్ లో ఆరోగ్య శా ఖ పరిస్థితి దయనీయంగా మారిం ది. బీఆర్ఎస్ హయాంలో ఎంజీఎంలో 250 గుండె ఆపరేషన్లు ఉ చితంగా చేశాం. కానీ ఇప్పుడు ఆపరేషన్ థియేటర్లలో ఏసీలో నీళ్లు కారుతు న్నాయని థియేటర్లనే మూసేశారు.

రోగులను హైదరాబాద్ కు పంపిస్తు న్నారు. మేము కేథలాబ్ లు, మూ డు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మీ చేతిలో పెడితే, వాటిని నడిపిం చే సత్తా కూడా మీకు లేదు.ఎక్స్రే మిషన్లు పనిచేయవు. ఆయుష్ ఆ సుపత్రిలో మందులు లేవు. ఎంజీ ఎంను తక్షణమే సమీక్షించి, అవు ట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

కేసీఆర్ రూ. 100 కోట్లతో జర్నలి స్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశా రు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెం డు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒ క్క రూపాయి అయినా కేటాయిం చిందా? రెండున్నరేళ్లలో ఒక్కరికై నా కొత్త అక్రిడేషన్ కార్డ్ ఇచ్చారా? జర్నలిస్టులకు ఎలాంటి నిబంధ న లు లేకుండా అక్రిడేషన్లు ఇవ్వాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసి నట్లుగా జర్నలిస్టుల యాక్సిడెం ట ల్ ఇన్సూరెన్స్ కు ప్రభుత్వమే ప్రీ మియం చెల్లించాలి. లేదంటే ప్ర మాదవశాత్తు జర్నలిస్టులు మర ణి స్తే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడ తాయి. ఎంప్లాయిస్ హెల్త్ స్కీ మ్ ను, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను స మానంగా అమలు చేయాలని డి మాండ్ చేస్తున్నాం.

నిన్న వరంగల్‌లో కార్పొరేటర్లను, మొన్న బాల్క సుమన్‌ను, ఆమన్ గల్లులో బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారు. కక్షలు కట్టడం కాదు, ముందు ఆసుపత్రి కట్టు రేవంత్ రెడ్డి. ఆసుపత్రి పూ ర్తయితే కొన్ని వేల మంది పేదలకు వై ద్యం దొరుకుతుంది. కేసీఆర్ మీద పడి ఏడ్వడం మానేసి, 20 లక్షల స్క్వేర్ ఫీట్స్ తో కడుతున్న ఈ ఆ సుపత్రిని వెంటనే పూర్తి చేసి ప్రజ లకు అంకితం చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు వ్యా ఖ్యానించారు.

జనత
www.epaperjanathadaily.in
బుధవారం 25 ఫిబ్రవరి 2026


# యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరెస్టు

## ఏఐ సమ్మిట్‌లో నిరసన ఫలితం

## అర్ధనగ్న ప్రదర్శనతో సర్వత్రా విమర్శలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతంగా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# శశికళ కొత్త పార్టీ ప్రారంభం

## పేరును త్వరలో ప్రకటిస్తానని వెల్లడి

**చెన్నై :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ కీలక ప్రకటన చేశారు. తమిళనాట కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కొత్త రాజకీయ చరిత్రను మనం చూడబోతున్నామని, కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ద్రవిడ ఉద్యమం స్ఫూర్తితో అన్నాదురై, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ అడుగుజాడల్లో పార్టీని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. పేదలు, బడుగు వర్గాలు, సామాన్య ప్రజానీకం కోసం పార్టీ పాటుపడుతుందని, శత్రువులు, ద్రోహులను ఏరివేస్తామని శశికళ తెలిపారు. పార్టీ జెండాను ఈ సందర్భంగా శశికళ ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగి, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్తరువులతో ఈ జెండా రూపొందింది. పార్టీ పేరును త్వరలోనే ప్రకటిస్తామని శశికళ తెలిపారు. 2016లో జయలలిత మరణాంతరం జరిగిన సంఘటనలను శశికళ గుర్తుచేసుకుంటూ, అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా తనను ముఖ్యమంత్రి కావాలని కోరారని చెప్పారు. 'చిన్నమ్మా... మీరు తప్పనిసరిగా ముఖ్యమంత్రి కావాలి అని వాళ్లంతా నాతో అన్నారు' అని తెలిపారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా హామీలు

## ప్రతి కుటుంబానికి పదివేల ఆర్థిక సాయం

## అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి పళనిస్వామి

**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్నాడీఎంకే హామీల వర్షం కురిపించింది. నేరుగా ఆర్థిక సాయం, సబ్సిడీల పెంపు, రుణాల మాఫీ, నిరుద్యోగులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, చిరు వ్యాపారాలను ఆదుకోవడం వంటి కీలక హామీలను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందిస్తామని, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు నమోదు చేసుకుని ఉద్యోగం కోసం వేచిచూస్తున్న వారికి నెలవారీ సాయంగా రూ.2,000 చొప్పున ఇస్తామని, హైయర్ సెకండరీ వరకూ చదివి ఎంఎ÷-లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి రూ.1,000 చొప్పున నెలవారీ సాయం అందిస్తామని పళనిస్వామి తెలిపారు. ఏటా చేపలవేటపై నిషేధం ఉన్న కాలంలో మత్స్యకారులకు ఇచ్చే సాయాన్ని రూ.8,000 నుంచి రూ.12,000కు పెంచుతామని పళనిస్వామి ప్రకటించారు. దీనితో పాటు ఏటా పొంగల్‌కు ఇచ్చే గిఫ్ట్ హ్యాంపర్‌కు అదనంగా మరో వెయ్యి రూపాయలు ఇస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని 300 యూనిట్ల నుంచి 450 యూనిట్లకు పెంచుతామని, పవర్ లూమ్ నేత కార్మికులకు ఉచిత విద్యుత్ పరిమితిని 1,000 యూనిట్ల నుంచి 1,400 యూనిట్లకు పెంచుతామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పేవ్‌మెంట్ల మీద వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులు సహకార బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు.

# పదేళ్లుగా ఒకే వ్యక్తి పాల పంపిణీ

## 16న 110 కుటుంబాలకు పాల సరఫరా

## పాల కల్తీపై విచారణ సాగుతోంది

## ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

**అమరావతి :** రాజమహేంద్రవరంలో కల్లోలం సృష్టించిన కిడ్నీ వ్యాధులు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటివరకు 16 మంది బాధితులను అధికారులు గుర్తించగా.. వారిలో ఐదుగురుబి మృతి చెందారు. ఈ వ్యవహారంపై ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ మీడియా సమావేశం నిర్వహించారు. బాధితులు ఆ వ్యక్తి నుంచి పదేళ్లుగా పాలు పోయించుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల పాల రుచిలో తేడా వచ్చిందని, వాంతులు కావడంతో అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రుల్లో చేరినట్లు చెప్పారు. బాధితులు ఒకే ప్రాంతం నుంచి రావడంతో వైద్యులకు అనుమానం వచ్చింది. పాలు తాగడం వల్లే ఇలా జరిగిందని వారు అధికారులకు చెప్పారు. ఈ నెల 16న ఆ వ్యక్తి 110 కుటుంబాలకు పాలు పోశారు. 315 మంది నుంచి రక్త నమూనాలు సేకరించాం. కొన్ని పరీక్షలు చేయించాం. నివేదికలు రావాల్సి ఉందన్నారు. పోలీసు ఫోరెన్సిక్ బృందం కూడా నమూనాలు సేకరించింది. కూలెంట్ లీకేజీనే ప్రస్తుత పరిస్థితికి కారణమని ప్రాథమికంగా అంచనాకు వచ్చాం. బాధితుల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. వారు కోలుకునేందుకు మెరుగైన ఔషధాలు ఇస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో మరో నెలపాటు పరిస్థితులు పర్యవేక్షిస్తాం. పాల కల్తీ ఎలా జరిగిందనేది విచారణలో తేలుతుంది. కూలెంట్ ఉన్నచోటే ఏదైనా జరిగిందా? అని మాకు అనుమానం ఉందని వీరపాండియన్ వివరించారు. రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న ఆరేళ్ల బాలుడు మృతి.. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# కేరళ.. ఇక నుంచి కేరళం

## రాష్ట్ర పేరు మార్పునకు కేంద్రం ఆమోదం

## సేవా తీర్థ్‌లో తొలిసారి క్యాబినెట్ భేటీ




**న్యూఢిల్లీ :** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మ-రోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్ర్య పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

## అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ

## మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్



**భోపాల్ :** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీ-యుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్ధాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# యూత్ కాంగ్రెస్ నేతలు వీర సింహాలు

## వారు దేనికీ భయపడబోరన్న రాహుల్

**భోపాల్ :** ఢిల్లీలోని భారత్ మండపంలో ఫిబ్రవరి 10న జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో చొక్కాలు విప్పి నిరసనలు తెలిపిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. దేశ ప్రతిష్టను దిగజార్చే చర్చలకు కాంగ్రెస్ పాల్పడిందంటూ ఈ ఘటనపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండగా, తాజాగా ఐవైసీ కార్యకర్తలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఐవైసీ కర్యకర్తలను అత్యంత ధైర్యవంతులైన సింహాలుగా అభివర్ణించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదన్నారు. 'షర్ట్‌లెస్' నిరసనలకు సంబంధించి యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు మంగళవారంనాడు అరెస్టు చేశారు. తిలక్ మార్గ్


పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారణ జరిపి అరెస్టు చేశారు. అనంతరం ఆయనకు పాటియాల హౌస్ కోర్టు నాలుగు రోజుల కస్టడీ విధించింది. కాంగ్రెస్ నిరసనలకు ప్రధాన సూత్రధారి చిబ్ అని, ఇది జాతీయ భద్రత, దేశ స్వారభౌమాధికారం, సమగ్రతకు చెందని కేసు అని పోలీసులు చెబుతున్నారు. దీనిపై భోపాల్‌లో జరిగిన కిసాన్ మహాచౌపల్‌లో రాహుల్ గాంధీ స్పందించారు. యూత్ కాంగ్రెస్ సభ్యులంతా బబ్బర్ షేర్‌లు. మీరు ఎవరికీ భయపడాల్సిన పని లేదు. మీలో దేశభక్తి రక్తం ఉంది. మీరు హరిత విప్లవం తీసుకువచ్చారు. పరిశ్రమలు తీసుకొచ్చారు. ఐటీ విప్లవం తెచ్చారు. వీటన్నింటికీ మోదీ చరమగీతం పాడారు' అని రాహుల్ అన్నారు.

# బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

## దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం

## గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు

## 14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్




**న్యూఢిల్లీ :** మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగిల్ షాట్ గార్డాసిల్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందిస్తారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్‌లోని నాలుగు రకాల (6, 11, 16, 10) ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక వ్యాక్సిన్ డోసు తీసుకోవడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాలిక రక్షణ ఉంటుంది. జాతీయ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనుంది. 15 ఏళ్లలోపు వయసున్న బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను రెండు డోసులు అందించాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర రూ.3,927. అయితే 15 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసులు తీసుకోవాలి. గార్డాసిల్-4 వ్యాక్సిన్‌ను ఎంఎస్‌డీ ఇండియా అనే సంస్థ తయారు చేస్తోంది. ఈ టీకా 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్టు అంచనా. హెచ్‌పీవీ రకాల వల్ల వ్యాపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో ఈ టీకా 93 నుంచి 100 శాతం ప్రభావంతో పనిచేసినట్టు ఆధారాలు ఉన్నాయి.

# ఎంతకాలం ఉంటానో తెలియదు

## అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు

## నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్ :** నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది.తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు.2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# సెమీస్‌కు ఇంగ్లండ్

## బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్.. పాకిస్థాన్‌పై ఘనవిజయం



పల్లెకెలె: టీ20 ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ సెమీస్ బెర్తును ఖరారు చేసుకుంది. సూపర్-8 దశలో భాగంగా ఇదివరకే శ్రీలంకను ఓడించిన ఆ జట్టు.. మంగళవారం పల్లెకెలెలో జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్ చేరుకుంది. పాక్ నిర్దేశించిన 165 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 100, 10 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడి ఒంటిచేత్తో ఆ జట్టును సెమీస్‌కు చేర్చాడు.

పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది (4/30), ఉస్మాన్ తారిఖ్ (2/31) రాణించినా బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యాలతో ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. సాహిబ్‌జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 63, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫకార్ జమాన్ (16 బంతుల్లో 25, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఇక ఈ ఓటమితో సెమీస్ చేరే అవకాశాలను పాకిస్థాన్ మరింత సంక్లిష్టం చేసుకుంది.

### కెప్టెన్ షో

మోస్తరు ఛేదనలో ఇంగ్లండ్ కూడా ఆరంభం నుంచే ఆపసోపాలు పడింది. షహీన్ అఫ్రిది వరుస ఓవర్లలో ఇంగ్లిష్ ఓపెనర్లను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బకొట్టాడు. తొలి బంతికే ప్రమాదకర ఫిల్ సాల్ట్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో ఓవర్లో బట్లర్ (2)నూ వెనక్కి పంపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన ఇంగ్లండ్ సారథి క్రీజులో పట్టుదలగా ఆడినా అతడికి సహచరుల నుంచి మద్దతు కరువైంది. అఫ్రిదికి తోడు స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ మాయతో ఆ జట్టు బెతెల్ (8), బాంటన్ (2), కరన్ (16) వికెట్లను నష్టపోయింది. అయినా బ్రూక్ మాత్రం పట్టు వీడలేదు. మిర్జా రెండో ఓవర్లోనే 76 మీటర్ల సిక్స్‌తో వేట మొదలుపెట్టిన అతడు.. నవాజ్ వేసిన పవర్ ప్లే ఆఖరి ఓవర్లో 4, 4, 6 బాది తన ఉద్దేశాన్ని చాటాడు.

ఒకపక్క పాక్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచినా కెప్టెన్ మాత్రం ఏకాగ్రత కోల్పోలేదు. 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. షాదాబ్ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో 17 పరుగులు రాబట్టాడు. కరన్‌ను తారిఖ్ బోల్తా కొట్టించినా ఆల్‌రౌండర్ విల్ జాక్స్ (28) తో కలిసి ఆ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఉస్మాన్ ఓవర్లో బౌండరీతో 90లలోకి వచ్చిన బ్రూక్.. అఫ్రిది 17వ ఓవర్లో 6,4తో తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని పూర్తిచేశాడు. శతకం తర్వాతి బంతికే అతడు ఔట్ అయ్యాడు. విజయానికి 5 పరుగులు అవసరమనగా నవాజ్ ఓవర్లో జాక్స్, ఒవర్టన్ నిష్క్రమించడంతో ఉత్కంఠ రేగినా ఆర్చర్ బౌండరీతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### ఫర్హాన్ ఒక్కడే..

పాక్ ఇన్నింగ్స్‌లో ఫర్హాన్ ఆటే హైలైట్. ఎప్పట్లాగే ఆ జట్టు ఒడిదొడుకులతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా ఫర్హాన్ క్రీజులో నిలిచి 'మెన్ ఇన్ గ్రీన్'కు మెరుగైన స్కోరును అందించగలిగాడు. ఆర్చర్ రెండో ఓవర్లో ఓపెనర్ సయీం అయూబ్ (7) మరోసారి నిరాశపరచగా డాసన్ మూడో ఓవర్లో కెప్టెన్ సల్మాన్ అఘా (5) కూడా అతడినే అనుసరించాడు. ఈ క్రమంలో బాబర్ ఆజమ్ (25)తో కలిసిన ఫర్హాన్ ధాటిగా ఆడే యత్నం చేశాడు. కానీ పవర్ ప్లే తర్వాత ఈ జోడీ సింగిల్స్‌కు పరిమితమవడంతో స్కోరు వేగం తగ్గింది. ఒవర్టన్ 11వ ఓవర్లో బాబర్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అతడి స్థానంలో వచ్చిన ఫకార్ (23) రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో వేగంగా ఆడాడు. జాక్స్ 14వ ఓవర్లో రెండు సిక్సర్లతో అర్ధ శతకాన్ని పూర్తిచేసిన ఫర్హాన్‌ను ఒవర్టన్ 16వ ఓవర్లో ఔట్ చేశాడు. అక్కడ్నుంచి పాక్ ఇన్నింగ్స్ గాడితప్పింది. ఫర్హాన్ నిష్క్రమించే సమయానికి 15.1 ఓవర్లలో 122/3గా ఉన్న పాకిస్థాన్, ఆ తర్వాత 4.2 ఓవర్లలో 43 పరుగుల వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయింది.

### సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లకు 164/9 (ఫర్హాన్ 63, ఫకార్ 25, డాసన్ 3/24, ఒవర్టన్ 2/26);

ఇంగ్లండ్: 19.1 ఓవర్లకు 166/8 (బ్రూక్ 100, జాక్ 28, అఫ్రిది 4/30, ఉస్మాన్ 2/31)

# తుది జట్టులోకి అక్షర్!..

## కుటుంబ కారణాలతో ఇంటికి రింకూ





చెన్నై: టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దక్షిణాఫ్రికా చేతిలో భారీ ఓటమి తర్వాత సెమీఫైనల్ బెర్తు అవకాశాలను కఠినంగా మారడంతో మిగిలిన రెండు మ్యాచ్‌లు టీమ్‌ఇండియాకు కీలకంగా మారాయి. జింబాబ్వేతో పోరు కోసం మంగళవారం భారత క్రికెటర్లు నెట్స్‌లో చెమటోడ్చారు. సఫారీలతో పోరులో తుది జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు రావడంతో మేనేజ్‌మెంట్ దిద్దుబాటు చర్యలకు దిగింది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో వైస్ కెప్టెన్ అక్షర్‌పటేల్ దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తున్నది. నెట్ సెషన్‌లో చాలాసేపు బౌలింగ్ చేయడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. మరోవైపు కుటుంబ కారణాల రీత్యా రింకూసింగ్ ఉన్నఫళంగా ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. తన తండ్రి కాన్‌చంద్‌సింగ్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో దవాఖానలో చేర్పించినట్లు జట్టు వర్గాలు పేర్కొన్నాయి. దీంతో జింబాబ్వే పోరుకు రింకూ అందుబాటులో ఉండేది అనుమానంగా మారింది. రింకూ స్థానంలో శాంసన్‌ను తీసుకుంటారా లేక కుల్దీప్‌యాదవ్‌కు బెర్తు దక్కుతుందా అన్నది తేలాల్సి ఉంది.

# డేవిడ్ మిల్లర్‌తో రీల్

## ఇన్‌ఫ్లూయర్స్‌పై విమర్శల దాడి

**న్యూఢిల్లీ :** సూపర్ 8 తొలి మ్యాచ్‌లో భారత జట్టు దారుణ ఓటమిని అభిమానులను జీర్ణించుకోలేకపోతున్నారు. సెమిస్ అవకాశాల్ని సంక్లిష్టం చేసిన పరాజయంపై మండిపడుతున్న ఫ్యాన్స్.. ఓ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను బెదిరింపులకు గురి చేశారు. ఇంతకూ ఆమెను ఎందుకు టార్గెట్ చేశారో తెలుసా.. అహ్మదాబాద్‌లో టీమిండియా ఓటమిలో కీలకమైన డేవిడ్ మిల్లర్ తో రీల్ చేసింది తను. ఇంకేముంది.. కొందరు అమెను ట్రోల్ చేస్తూ.. బెదిరింపులకు దిగారు. అత్యాచారం చేస్తామని, బొండంలా ఉన్నావని.. ఇలా బాడీషేమింగ్‌తో బాధ పెట్టారు. ఇవన్నీ భరించలేక తను ఈ రీల్‌ను తొలగించింది. అహ్మదాబాద్‌లో ఫిబ్రవరి 21న భారత్, దక్షిణాఫ్రికా తలపడగా.. ఆల్‌రౌండ్ షోతో సఫారీ టీమ్ 76 పరుగుల తేడాతో గెలుపొందింది. సమిష్టి వైఫల్యంతో ఓడిన టీమిండియా అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. అసలే ఓటమిని తట్టుకోలేని ఫ్యాన్స్‌కు ప్రొటీస్ హిట్టర్ డేవిడ్ మిల్లర్‌తో ఇన్‌ఫ్లూయెన్సర్, ఆర్జే ప్రిన్సీ పారీక్ (ఖీఏ ఖసతినిఞా ఖజీసతీర) చేసిన రీల్ కనిపించింది. క్యాచ్ అనంతరం మిల్లర్‌తో మైదానంలో చేసిన రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ప్రిన్సీ.. 'మిల్లర్ అద్భుతమైన బ్యాటర్ కదా.. మిల్లర్ మనమిద్దరం స్నేహితులం అనుకుంటున్నా' అని క్యాప్షన్ పెట్టింది. ఆ రీల్ చూసిన కొందరు ఆమెను ట్రోల్ చేశారు. బొద్దుగా ఉన్న ఆమెను బాడీ షేమింగ్ చేస్తూ కామెంట్లు పెట్టారు. అత్యాచారం చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు మరికొందరు నెటిజన్లు. తనను లక్ష్యంగా చేసుకొని వస్తున్న ట్రోల్స్‌ను తట్టుకోలేక ఫేస్‌బుక్ నుంచి మిల్లర్ రీల్‌ను తొలగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఇన్‌స్టా వేదికగా ఆమె వెల్లడించింది. గతంలో భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాతోనూ ప్రిన్సీ రీల్ చేసి వైరలైంది. 'డేవిడ్ మిల్లర్‌తో తీసిన రీల్ వీడియోను ఫేస్‌బుక్ నుంచి తొలగించాను. గ్రాఫిక్ ఫొటోలు, అత్యాచార బెదిరింపులను.. బాడీషేమింగ్ కామెంట్లను భరించకలేక ఈ నిర్ణయం తీసుకున్నా. ప్రస్తుతం నన్ను నేను కోల్పోయినట్టుఅనిపించింది' అని బాధతో కూడిన మెసేజ్ పెట్టింది ప్రిన్సీ. మిల్లర్‌తో రీల్ చేసిందని ప్రిన్సీని టా÷-గ్గ÷ట్ చేయడం భావ్యం కాదంటున్నారు పలువురు. 'ఆటగాళ్లకే కాదు అభిమానులకూ క్రీడా స్ఫూర్తి ఉండాల'ని కామెంట్లు పెడుతున్నారు కొందరు. ఇండియా మ్యాచ్ అనంతరం మిల్లర్‌తో ప్రిన్సీ చేసిన రీల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంకా ఉంది.





## లక్నో సూపర్ జెయింట్స్

# కొత్త లోగో..జెర్సీ విడుదల




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 :** ఐపీఎల్‌లో ప్రతిసారి గట్టి పోటీనిచ్చే లక్నో సూపర్ జెయింట్స్ వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకున్న లక్నో.. ఇకపై కొత్త లోగోతో మైదానంలోకి దిగనుంది. లావెండర్ రంగులో లక్నో పట్టణం చరిత్రను ప్రతిబింబించేలా గరుగ్మంతుడు, కిరీటం, ఏనుగు బొమ్మతో రూపొందించిన లోగో ప్రత్యేక ఆకర్షణగా మారింది. లక్నో ఫ్రాంచైజీ కొత్త లోగో ఉత్తరప్రదేశ్.. లక్నో పట్టణ విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా సరికొత్తగా.. అభిమానులకు అమితంగా నచ్చేలా రూపొందించారు. తాజా లోగోలో శక్తివంతమైన గరుడు, కిరీటం, ఏనుగు బొమ్మలు ఉన్నాయి. గరుడ (గరుత్మంతుడు) చిహ్నం ధైర్యానికి ప్రతీక. సవాళ్లను స్వీకరించడం.. వెనక్కి తిరిగి చూడకపోవడం, ఉన్నత శిఖరాలకు చేరడాన్ని సూచిస్తుంది. లక్నో జట్టు అనుసరించే భయమన్నది ఎరుగని క్రికెట్‌ను, సమిష్టిగా ఆడితే అసాధ్యమైన లక్ష్యమంటూ ఉండదని చాటుతుంది. కిరీటం విషయానికొస్తే దర్పం, బాధ్యతకు ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి లక్షలాదిమంది ఆశల్ని లక్నో జట్టు మోస్తుంది. లక్నో జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. ప్రతిరోజు ఈ గౌరవాన్ని పొందాలని కిరీటం




సూచిస్తుంది. కొత్త లోగుకు ఏనుగు బొమ్మ గుండెతో సమానం. బలం, తెలివి, ఓపిక, ఐక్యత.. ఈ లక్షణాలకు ప్రతిరూపమే ఏనుగు. ఫలితంతో సంబంధం లేకుండా సీజన్ సీజన్‌కు అభిమానుల నుంచి లభిస్తున్న నిరంతర మద్దతు, వారు చూపించే కృతజ్ఞతా భావానికి బొమ్మ ప్రతీక. క్లుప్తంగా చెప్పాలంటే లక్నో వీధులకు సబంధించిన లోగో ఇది. ఇంట్లో ఉండి క్రికెట్ మ్యాచ్‌లు చూసే కుటుంబాలు, ఏదో ఒకరోజు లక్నో జెర్సీ వేసుకోవాలని ఆశపడే యువతకు ఇది ప్రతిబింబం.

కొత్త లోగో.. ఈ ప్రాంత చరిత్ర, గౌరవం, ఐకత్య సందేశాన్ని చాటుతుంది. ర్‌పీఎస్‌జీ గ్రూప్ ఛైర్మన్, లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా తమ కొత్త లోగోపై ఏమన్నారంటే.. 'ఈ కొత్త లోగో మా ఫ్రాంచైజీ భావోద్వేగానికి సంబంధించినది. మొదటి రోజు నుంచి ఉత్తరప్రదేశ్, లక్నో ప్రజలు లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ హృదయాల్లో స్థానమిచ్చారు. అభిమానుల నమ్మకం, ప్రేమకు కృతజ్ఞతగా ఈ సింబల్‌ను రూపొందించాం. ఉన్నత స్థానానికి చేరాలనే మా కలకు గరుడ ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి గర్వపడే ప్రదర్శన చేయాలని కిరీటం సూచిస్తుంది. లక్నో ప్రాంత వైవిధ్యం, ద్రుఢత్వానికి ఏనుగు సంకేతం. ఈ లోగోను మార్పుకోసమే తీసుకురాలేదు. ఇదొక ప్రామిస్. లక్నో సిటీని, ఇక్కడి మూలాలను మేము ఎంతగా గౌరవిస్తామో ఈ లోగో చెప్పకనే చెబుతుంది. ప్రతి పరుగు, వికెట్, మైదానంలోని ప్రతి క్షణం.. అభిమానుల ఎమోషన్స్‌ను చూపిస్తాయి. ఈ కొత్త లోగో ఇకపై లక్నో జట్టు జెర్సీపై, కిట్లపై, డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్స్‌లోనూ కనిపించనుంది. మా ఫ్రాంచైజీ అధికారిక ప్రచార సంస్థలు.. కొత్త లోగోతో కొనసాగుతాయి' అని సంజీవ్ వెల్లడించారు.

# ఆసీస్‌దే తొలి వన్డే.. టీమ్‌ఇండియాకు పరాభవం

బ్రిస్బేన్: భారత్‌తో స్వదేశంలో ఇటీవలే ముగిసిన టీ20 సిరీస్‌లో ఓడిన ఆస్ట్రేలియా మహిళల జట్టు.. వన్డే సిరీస్‌ను మాత్రం విజయంతో ఆరంభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనను 6 వికెట్ల తేడాతో ఓడించింది. బ్యాటింగ్ వైఫల్యంతో భారత్ ఓటమిని మూటగట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేస్తూ 52 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన జట్టును స్మృతి మంధాన (58), హర్మన్‌ప్రీత్ (53) ఆదుకున్నారు. మహిళల వన్డే ప్రపంచకప్ తర్వాత తొలి మ్యాచ్ ఆడిన ప్రతీక డకౌట్ అవగా షెఫాలీ, జెమీమా, దీప్తి సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (43) రాణించడంతో 48.3 ఓవర్లకు భారత్ 214 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని ప్రత్యర్థి ఎదుట ఉంచగల్గింది. ఆసీస్ బౌలర్లలో ఆష్లీ





గార్డ్‌నర్ (3/33), మేగన్ షట్ (2/42) రాణించారు. లక్ష్యాన్ని కంగారూలు 38.2 ఓవర్లలోనే పూర్తిచేశారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' బెత్ మూనీ (76), కెప్టెన్ అలిస్సా హీలి (50) అర్ధ శతకాలతో రాణించారు.

## అమ్మాయిల పొట్టిపోరు షెడ్యూల్ విడుదల.. గ్రూప్-1లోనే దాయాదులు

దుబాయ్: ప్రస్తుతం భారత్, శ్రీలంకలో జరుగుతున్న పురుషుల ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముగిసిన కొద్దినెలలకే అమ్మాయిల పొట్టి పోరు అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీని జూన్ 12 నుంచి జులై 05 దాకా నిర్వహించనుండగా ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. పదో ఎడిషన్‌గా జరుగబోయే ఈ మెగా టోర్నీలో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి 12 జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి.

12 జట్లను రెండు గ్రూపులుగా విభజించగా భారత్.. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, దాయాది పాకిస్థాన్‌తో కలిసి గ్రూప్-1లో ఉంది. గ్రూప్-2లో వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ ఉన్నాయి. జూన్ 12 నుంచి 28 దాకా లీగ్ మ్యాచ్‌లు జరుగనుండగా జూన్ 30, జులై 2న 'ది ఓవల్'లో సెమీస్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. జులై 5న ప్రతిష్టాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ ఫైనల్‌కు ఆతిథ్యమివ్వనుంది. జూన్ 14న భారత జట్టు.. పాకిస్థాన్‌తో ఆడబోయే మ్యాచ్‌తో టోర్నీని ఆరంభించనున్నది.




## కల్కి-2 షూటింగ్‌లో బచ్చన్, కమల్

పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 -2' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుంది. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 ంఆ' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుండగా.. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ ద్వారా ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. 'దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్ళీ కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిస్తోంది. చివరిసారిగా మేమిద్దరం 1985లో 'గిరఫ్తార్' సినిమాలో కలిసి నటించాం' అని రాసుకొచ్చారు. ఇక అమితాబ్ షేర్ చేసిన ఫోటోలలో ఇద్దరు స్టార్స్ ఆత్మీయంగా కౌగిలించుకోవడం, సరదాగా ముచ్చటించుకోవడం కనిపిస్తోంది. ఇందులో బిగ్ బీ తన అశ్వత్థామ గెటప్‌లో కనిపించబోతున్నాడు.

## వారణాసి కోసం జార్జియాకు మహేశ్ బాబు

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కథను కె.వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి అందిస్తుండగా, మాటలను దేవ కట్టా రచిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. సినిమాలో మహేశ్ బాబు ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. 'రుద్ర'గా శక్తివంతమైన యోధుడిగా, అలాగే పౌరాణిక ఎపిసోడ్‌లో 'రాముడు'గా దర్శనమివ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకినీ' పాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల పరిచయంతోనే సినిమాపై అంచనాలు గరిష్ట స్థాయికి చేరాయి. హైదరాబాద్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూనిట్, తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు వెళుతున్నారు . ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే అడ్వెంచర్ ఎపిసోడ్‌లను విదేశీ లొకేషన్లలో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. అయితే జార్జియాకి వెళుతున్న మహేష్ బాబుకి భార్య నమ్రత, కూతురు సితార సెండాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే గ్రాండ్ యాక్షన్ బ్లాక్స్, భారీ సెట్స్ ఈ షెడ్యూల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇది పూర్తిస్థాయి సైన్స్ ఫిక్షన్ సినిమా కాదని, ఫాంటసీ మైథలాజికల్ జానర్‌కే చెందినదని రాజమౌళి తెలిపారు. పురాణాల నేపథ్యాన్ని ఆధునిక యాక్షన్ అడ్వెంచర్ శైలిలో మేళవిస్తూ భిన్న కాలప్రవాహాలను కలిపే కథగా 'వారణాసి' రూపుదిద్దుకుంటోందని చెప్పారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా మూవీ విడుదల కానుంది.



## బాలయ్య, పూరి కాంబినేషన్
### మూవీ చేస్తున్నారంటూ టాలీవుడ్ టాక్



టాలీవుడ్‌లో మాస్ ఇమేజ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన నందమూరి బాలకృష్ణ, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తో మరోసారి చేతులు కలపబోతున్నారనే వార్తలు ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందన్న ప్రచారం ఆసక్తి రేకెత్తిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పైసా వసూల్ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకున్నప్పటికీ, బాలయ్యను స్టైలిష్ మరియు డిఫరెంట్ అవతార్‌లో చూపించడంలో పూరీ విజయం సాధించారు. ఆ సినిమాతో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందని అప్పట్లోనే ఇండస్ట్రీలో టాక్ వినిపించింది. ఇప్పుడు ఆ బాండింగ్ రెండో సినిమాకు దారితీస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది.ప్రస్తుతం పూరీ జగన్నాథ్ ఫామ్‌లో లేకపోయినా, ఆయన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌పై బాలకృష్ణ నమ్మకం ఉంచినట్లు సమాచారం. సరైన కథతో వస్తే పూరీతో మరోసారి పని చేయడానికి బాలయ్య సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. అఖండ విజయంతో బాలకృష్ణ కెరీర్‌లో కొత్త ఊపు వచ్చింది. యంగ్ డైరెక్టర్లతో కలిసి తన ఇమేజ్‌కు తగ్గ కథలను ఎంచుకోవడం ఆయన విజయాలకు ప్రధాన కారణంగా మారింది. ఇటీవల కాలంలో కథ ఎంపికలో బాలయ్య చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడి పేరు కంటే కథలోని కొత్తదనం, పాత్ర బలానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని సమాచారం. ఇక పూరీ జగన్నాథ్ విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం విజయ్ సేతుపతితో ఓ కొత్త ప్రాజెక్ట్ తెరకెక్కిస్తున్నారు. చాలాకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న పూరీ, ఈ సినిమాతో మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ సక్సెస్ అయితే, బాలయ్య?పూరీ కాంబోకు మరింత బలాన్నిస్తుందని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలకృష్ణ-పూరీ జగన్నాథ్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాయి.

## గల్లాలు పట్టుకున్న మహేశ్ బాబు, రాజమౌళి
### వారణాసిపై వర్మ ఏఐ వీడియో వైరల్

అసాధ్యాలను సైతం సుసాధ్యం చేస్తోంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలుసుకోలేనంతగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తోంది. ఏఐ సహాయంతో సృష్టించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. అచ్చం అలాంటి ఒక వీడియోనే సినీ దర్శకుడు రామ్ గోపాల్‌వర్మ తాజాగా పంచుకున్నారు. ఇంతకీ అందులో ఏముందో స్టార్ హీరో మహేశ్‌బాబు , అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గొడవ పడుతున్నట్లు ఉన్న ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'సినిమా ఈజ్ డెడ్' అంటూ వర్మ పంచుకున్న ఈ ÷టింగ్ వీడియోపై అనేక కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొందరు ఈ క్రియేటివిటీని మెచ్చుకుంటుంటే, మరికొందరు తప్పుపడుతున్నారు. 'ఏఐతో ఏదైనా సాధ్యమే!' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'వారణాసి ప్రచారం సమయంలో కచ్చితంగా ఈ వీడియోను ప్లే చేస్తా'రని వ్యాఖ్యలు జోడిస్తున్నారు. 'మహేశ్ పాస్‌పోర్ట్ విషయంలోనే ఇద్దరూ గొడవపడుతున్నారు' అంటూ అభిమానులు స్పందించడం గమనార్హం. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న ఎపిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ ఇటీవల విడుదల చేసిన వీడియో, సినిమాకు సంబంధించి పలు విషయాలను తెలియజేస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూలు 'వారణాసి'పై ఆసక్తి పెంచాయి.




## కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ
### ముందుగా కోర్టులో చిత్ర ప్రదర్శనకు ఆదేశం

'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది.ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.

# భాగ్యలక్ష్మీ ఆలయంలో బండి సంజయ్ దర్శనం

-- జీహెచ్ఎంసీ ఎన్నికలపై బీజేపీ పోరాటానికి పిలుపు



కరీంనగర్/హైదరాబాద్ (జనత న్యూస్): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దర్శించుకుని మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడంలో భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులే కారణమని పేర్కొన్నారు. మొక్కులు తీర్చుకునేందుకే ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో భాగ్యలక్ష్మీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతోనే ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించామని, ఆ యాత్ర 1640 కిలోమీటర్లు సాగిందని గుర్తుచేశారు. మజ్లిస్ కంచుకోటగా భావించే ప్రాంతంలోనే యాత్రను ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నామని బండి సంజయ్ పేర్కొన్నారు. గత కొంతకాలంగా దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. బాన్సువాడలో జరిగిన రాళ్లదాడి ఘటనపై దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. హిందూ ధర్మ రక్షణ కోసం బీజేపీ కట్టుబడి ఉందని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభివృద్ధి మరియు హిందుత్వ అంశాలపై ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర నిధులతోనే హైదరాబాద్ అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు, డీఏలు, బకాయిలు, పెన్షన్ల అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గల్లీ గల్లీ తిరిగి వాస్తవాలు ప్రజల ముందుంచుతామని బండి సంజయ్ తెలిపారు.

# 22వ డివిజన్‌కు చెత్త సేకరణ కోసం నూతన ట్రాక్టర్ కేటాయింపు



కరీంనగర్ (జనత న్యూస్): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 22వ డివిజన్‌లో చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నూతన ట్రాక్టర్‌ను కేటాయించారు. మంగళవారం మేయర్ కోలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేలా అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. వాహన కొరత ఉందని స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి నూతన ట్రాక్టర్‌ను కేటాయించినట్లు చెప్పారు. డివిజన్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాహనాన్ని మంజూరు చేసిన మేయర్ కోలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లకు కార్పొరేటర్ బండ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేష్, గుగ్గిల్లపు రమేష్, వంగల పవన్, పెద్దపల్లి జితేందర్, మొండన్న, ఎన్నం ప్రకాష్, వేముల చంద్రశేఖర్, వెంకటేష్‌లతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ మహిళా కాంగ్రెస్ నేతలకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇవ్వాలి




కరీంనగర్, ఫిబ్రవరి 24 (జనత న్యూస్): సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు కోరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. బూత్ స్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంతో పాటు గత పదేళ్లుగా ప్రతిపక్షంగా ఉన్న సమయంలో పార్టీ కోసం కృషి చేసిన సీనియర్ మహిళా నేతలకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో మహిళలకు సముచిత అవకాశాలు కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని కోరాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కర్ర సత్యప్రసన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, రాబోయే జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం మహిళా కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి రావడానికి దశాబ్దాలుగా శ్రమించిన మహిళా నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతూ తాను కృషి చేస్తానని తెలిపారు. జిల్లా స్థాయిలో భర్తీ కానున్న నామినేటెడ్ పోస్టుల్లో కూడా మహిళలకు అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి, నగర అధ్యక్షురాలు వెన్నం రజితా రెడ్డి, మండల, పట్టణ స్థాయి మహిళా అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, ఫిబ్రవరి 24 (జనత న్యూస్): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో 2026 పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, విభాగాధిపతులు, కస్టోడియన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు 82 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 15,358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో 7,700 మంది బాలురు, 7,637 మంది బాలికలు, 21 మంది ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు 82 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 82 మంది విభాగాధికారులు, 9 మంది కస్టోడియన్లను నియమించినట్లు వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, శుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు, ఏఎన్ఎం వైద్య సిబ్బందితో మెడికల్ సదుపాయం కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, గదుల్లో తగిన వెలుతురు, ఫర్నిచర్ కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. విధులు నిర్వహించే కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నాయో లేదో చీఫ్ సూపరింటెండెంట్లు ముందుగా పరిశీలించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించి పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, కేంద్ర నిర్వహణ బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదేనని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లకు తగిన శిక్షణ ఇవ్వాలని కూడా సూచించారు. ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి కేంద్రాలకు తరలించడం, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పోలీసు ఎస్కార్ట్‌తో భద్రంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రతి గదిలో పరీక్ష సమయాన్ని బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, పరీక్ష సమయానికి ఐదు నిమిషాల లోపు ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల మధ్య గ్యాప్ రోజుల్లో చదువుకోడానికి స్కూళ్లకు వచ్చే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రధానోపాధ్యాయులను సూచించారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పీఎం-శ్రీ పాఠశాలలకు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ భోజన నాణ్యత, సదుపాయాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సిద్దిపేట, ఫిబ్రవరి 24 (జనత న్యూస్): జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించిన అన్నం, క్యాబేజీ కూర, టమాటా చట్నీ, సాంబారును పరిశీలించారు. వసతి గృహంలో మొత్తం 100 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 83 మంది విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నట్లు విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థుల హాజరు మేరకు సరిపడా వంట సరుకులు అందించాల్సిందిగా, ప్రతి వంటకం రుచికరంగా ఉండి అందరికీ సరిపడేలా భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత అత్యంత ముఖ్యమని, భోజనం మరియు వసతి విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూడాలని, హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేయాలని, అక్కడ జరిగే కార్యకలాపాలన్నీ రికార్డు అయ్యేలా చూడాలని వార్డెన్ శ్వేతకు సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, వంటకు వినియోగించిన సరుకులు మరియు రిజిస్టర్‌లో నమోదైన వివరాల్లో తేడాలు ఉన్నట్లు గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వహణలో లోపాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్సీడీవోను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు మరమ్మతులో ఉన్నాయని తెలియడంతో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను వెంటనే పరిశీలించేందుకు ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తగినంతగా అందడం లేదని విద్యార్థులు తెలిపిన నేపథ్యంలో, నీటి మరియు శానిటేషన్ సౌకర్యాలను త్వరలోనే మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

# విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన హోమ్ గార్డ్ కుటుంబానికి అండగా సీపీ గౌష్ ఆలం

రూ. 1 లక్ష ఆర్థిక సాయం అందజేత



కరీంనగర్, ఫిబ్రవరి 24: విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదానికి గురైన హోమ్ గార్డ్ కుటుంబానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆర్థిక సహాయం అందజేశారు. సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తున్న శారద (48) కుటుంబానికి హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.1 లక్షల చెక్కును మంగళవారం సీపీ కార్యాలయంలో అందజేశారు. శారద ఇటీవల విధులు ముగించుకుని భర్త శ్రీనివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో శారదతో పాటు ఆమె భర్తకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికీ కాళ్లు విరిగినట్లు తెలిసింది. చికిత్స అనంతరం ప్రస్తుతం వారు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీపీ గౌష్ ఆలం తక్షణమే స్పందించి, బాధిత కుటుంబానికి వైద్య ఖర్చులు మరియు ఇతర అవసరాల కోసం హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, జానిమియా, హెడ్ కానిస్టేబుల్ రవి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం



కరీంనగర్, ఫిబ్రవరి 24, 2026: రోడ్డు భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ల కంటి చూపు లోపాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించడం, వారి ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌష్ ఆలం ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సురక్షిత ప్రయాణానికి స్పష్టమైన కంటి చూపు అవసరమని, ప్రైవేట్ వాహనాలు, టీజీఎస్ఆర్టీసీ, ఆటోలు మరియు భారీ వాహనాల డ్రైవర్లందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 27న కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో ఈ కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కరీంనగర్ నగరం మరియు పరిసర ప్రాంతాల డ్రైవర్లందరూ హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, శ్రీనివాస్, శ్రీనివాస జి, రమేష్, సతీష్, ఇన్స్పెక్టర్లు రామ్ చందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్-బీజేపీ విలీనం జరుగుతుందా? కాంగ్రెస్ నేతల ఆరోపణలు



కరీంనగర్, ఫిబ్రవరి 24 (జనత న్యూస్): బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతుందనే ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ప్రస్తావించారు. మంగళవారం కరీంనగర్ ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిణామాలపై పలు వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్జల కాంతం మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు కోల్పోయిందని పేర్కొన్నారు. బీజేపీ--బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ సమీకరణాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిపారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోందని పేర్కొన్నారు. అయితే ఈ అంశాలపై సంబంధిత పార్టీల నుండి అధికారిక స్పందన రావాల్సి ఉందన్నారు. కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి రావడంతో నగరాభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకురావాలని గజ్జల కాంతం డిమాండ్ చేశారు. నగరానికి భారీ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడితేనే ప్రజల విశ్వాసం పొందగలరని అన్నారు. హిందుత్వం పేరుతో రాజకీయ లాభం పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. బీజేపీ పుట్టకముందే హిందుత్వ భావజాలం ఉందని, అభివృద్ధి అంశాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పాలనలో నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి వంటి ప్రధాన ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలపై కేంద్ర స్థాయి పరిశీలన జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ అంశంపై ప్రతిపక్షాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రజాధనం వృథా అయిందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలు శాసనసభ సమావేశాలకు హాజరై ప్రాజెక్టులపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని కాంగ్రెస్ నేతలు కోరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని పార్టీలూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకరపు భాస్కర్ రెడ్డి, అకుల ప్రకాష్, గడ్డం నాగరాజు, క్యదాశు ప్రభాకర్, గజ్జెల ఆనందరావు, ఎండి సలీమ్ ఉద్దీన్, ఎర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలి: అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**




కరీంనగర్: మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి తప్పిదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వాహనాల ఇన్చార్జీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 73 రెగ్యులర్, 1 ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ సదుపాయం, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, పరీక్షలు నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో సుమారు 650 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేలా చూడాలని, సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, జాగ్రత్తలపై మాస్టర్ ట్రైనర్లు వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడి మాధవి, ఏసీజీఈ సంధ్యారాణి, డిసిఈబి కార్యదర్శి భగవంతయ్య, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాసు, కృపారాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు: జిల్లా వ్యవసాయ అధికారుల ప్రకటన



కరీంనగర్, ఫిబ్రవరి 25: జిల్లాలో జనవరి 31వ తేదీ నుంచి యూరియా ఎరువుల విక్రయాలు ప్రత్యేక యాప్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రతి మండలంలో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉందన్న సమాచారాన్ని ఈ యాప్‌లో రైతులు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మండలంలోని రైతులు తమ సాగు భూమికి అవసరమైన యూరియాను ముందుగానే యాప్ ద్వారా బుక్ చేసుకుని, బుకింగ్ ఐడి ఆధారంగా 24 గంటలలోపు సమీప డీలర్ వద్ద కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఆధార్ ధ్రువీకరణతో పాటు భూమి యజమాని వివరాలు నమోదు చేస్తే కౌలు రైతులు కూడా యూరియాను బుక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. పట్టా పాస్‌బుక్ లేని రైతులు తమ ఆధీనంలో ఉన్న సాగు భూమి వివరాలను మండల వ్యవసాయ అధికారికి సమర్పించి యూరియా బుక్ చేసుకోవచ్చని సూచించారు. తొలి విడతలో యూరియా కొనుగోలు చేసిన రైతులు మరోసారి బుకింగ్ చేసుకోవాలంటే 15 రోజుల విరామం అవసరమని తెలిపారు. యాప్ ద్వారా పారదర్శకంగా యూరియా పంపిణీ జరుగుతుండటంతో పాటు సమతుల ఎరువుల వినియోగానికి ఇది దోహదపడుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఉపకరిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో యాప్ ద్వారా యూరియా అమ్మకాలు ప్రారంభమైనప్పటి నుంచి 84,663 మంది రైతులు 3,01,479 యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 2,69,215 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,510 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, యూరియా దొరకదన్న ఆందోళనతో రైతులు తొందరపడాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగి భద్రయ్య మృతి

తిమ్మాపూర్, జనతా న్యూస్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎల్ఎండి యూనిట్ అధ్యక్షుడు బొమ్మిడి భద్రయ్య(89) మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీకి చెందిన భద్రయ్య మంగళవారం ఉదయం ఆయన అలుగునూర్ లోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఎల్ఎండి కాలనీ లోని ఇరిగేషన్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా గతంలో వివిధ హోదాల్లో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, డిఏం, ట్రేసర్స్ అసోసియేషన్ ఉద్యోగ సంఘాలకు అధ్యక్ష,కార్యదర్శిగా వివిధ హోదాలో ఉద్యోగ పదవి బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం రిటైర్డ్ ఎంప్లాయిస్ కు అధ్యక్షులుగా నాయకత్వం వహించారు. బొమ్మిడి భద్రయ్య మృతి పట్ల ప్రజాప్ర తినిధులు, నాయకులు, విశ్రాంత, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆయన భౌతిక గాయానికి ఘన నివాళులు అర్పించి ంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## గిడ్డంగుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



మానకొండూర్: రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగుల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపడుతోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలో నిర్మించనున్న 18,300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక సామర్థ్యం గల ఆధునిక గోదాముల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గిడ్డంగుల నిర్మాణాలకు చర్యలు ప్రారంభించిందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులకు అనుగుణంగా మార్కెట్ యార్డుల వద్ద గోదాములు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో అత్యధికంగా వరి పండించే జిల్లాల్లో కరీంనగర్ ఒకటని, దిగుబడులకు తగిన విధంగా నిల్వ సౌకర్యాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంత రైతుల అభ్యర్థన మేరకు రామకృష్ణ కాలనీలో గోదాం నిర్మాణానికి రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. గోదాం నిర్మాణ అవసరాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఎస్సారెస్పీ స్థలం కేటాయింపులో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారం అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో గిడ్డంగుల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల శ్వేత, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొమ్మెర మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసిన గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం



మానకొండూరు (జనత న్యూస్): గునుకుల కొండాపూర్ గ్రామ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగళవారం మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణను ఆయన నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణం, సీసీ రోడ్లు, రజక కమ్యూనిటీ హాల్, జిమ్ సెంటర్, క్రీడా ప్రాంగణం ఏర్పాటుతో పాటు గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. అలాగే ఎస్సీ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు, సహాయ సహకారాలు అందించే దిశగా తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు పై ప్రభుత్వ నిర్లక్ష్యం

**ఎన్నికల సమీపిస్తేనే ప్రభుత్వానికి ప్రాజెక్టు గుర్తుకొస్తుంది**

**98 శాతం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి**

**కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలు తప్ప చేసింది ఏమీ లేదు**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తేనే కాంగ్రెస్ నేతలకు గౌరవెల్లి ప్రాజెక్టు గుర్తుకొస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నాయకత్వంలో దాదాపు 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన రెండు శాతం పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడిచినా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. శాసనసభ ఎన్నికల సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పటివరకు భూసేకరణ సహా పెండింగ్ పనులపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టు పనులకు అడ్డంకులు ఉన్నాయని చెప్పడం సరైన కారణం కాదని, సమస్యలు ఉంటే పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాబోయే పరిషత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిధుల కేటాయింపు పేరుతో ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే మిగిలిన పనులు పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గానికి సాగునీరు అందించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పాకాల శ్యామ్ సుందర్ గౌడ్, పెసరు శ్రీనివాస్, యాస శ్రీనివాస్, గోపగోని అరవింద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## యువకుడి ఆత్మహత్య





చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన దురిశెట్టి రమేష్ (24) అనే యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, మంగళవారం ఉదయం 9:30 గంటల సమయంలో కొండాపూర్ టూ నవాబ్‌పేట మార్గంలోని ఒక బావి వద్ద రమేష్ ద్విచక్ర వాహనం కనిపించింది. బావిలో పరిశీలించగా రమేష్ చెప్పులు తేలుతూ కనిపించాయి. స్థానికుల సహాయంతో గాలించగా రమేష్ మృతదేహం లభ్యమైంది. గత 15 రోజులుగా రమేష్ తీవ్ర మనస్తాపంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తితోనే బావిలో దూకి ప్రాణాలు తీసుకున్నట్లు మృతుడి సోదరుడు దురిశెట్టి మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## క్రీడాకారిణులను సన్మానించిన ఎమ్మెల్యే



మానకొండూర్: రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థినులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురాగలరని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి లింగారెడ్డి, పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com